కమల

కొడవటిగంటి కృష్ణమూర్తి గారు

౧

ప్రొద్దున తొమ్మిదిన్నరగంటలయింది రైలు దిగి ప్రసాదరావు వూళ్ళోకిబండికట్టించాడు గుఱ్ఱం బండి కావటంచాత చకచకాపోతున్నది. ప్రసాదరావు గారంటే గొప్పధనికుడు ఒక్కఆడపిల్ల. పేరు కమల. చురుకైనతెలివికలది మాంచిఅందగత్తె అందగత్తెఅంటే భారత భాగవత రామాయణాదుల్లోని స్త్రీవర్ణన లాఅమ్మాయిదగ్గిరకుదరవు చూడటానికి ముచ్చటగాఉంటుంది. కన్నుముక్కుతీరు బాగుంటుంది లేడికళ్ళు. పచ్చనిశరీరం నల్లనివెంట్రుకలు కమలదగ్గర ఆకర్షణశక్తి అద్భుతంగాఉంది చిన్నప్పుడెవరైనా ఇంటికొచ్చి రొండురోజులుండి కమలకి రొండురూపాయలిచ్చి పోతూండేవారు. పదేళ్ళొచ్చినా తల్లీతండ్రీగట్టిగాకౌగిలించుకుని ముద్దుపెట్టుకునేవారు ఆఅమ్మాయిని ఊరకేచూడ బుద్ధవుతుంది.

కమలకు పదకొండోఏట పెళ్ళయింది. భర్తపేరు నరసింహారావు బి ఏ. ప్యాసయినాడు దాదాపు రొండులక్షలఆస్తిఉంది. ఆస్తికంతాఒక్కడే. దగ్గిర బంధువులుకూడా ఆట్టేలేరు. పెద్దమేడ. సినిమాల్లో చూపిస్తారుచూడండి—ఆమోస్తరుగా ఉంటుంది చుట్టూపూలమొక్కలూ చెప్పన్నివృక్షాలూఉన్నయ్. చూడబహుసొగసుగాఉంటుంది.

నరసింహారావుది కొంచెంపెడకట్టెమతం "ఏమిటో"అని! కాని గర్వంమట్టుకుకాదు. అత్తవారెప్పుడు పిలిచినాపోడు. పోగూడదని వ్రతమూలేదు మర్యాదలంటే అతనికి మాచెడ్డవెర్రికోపం ఎవరు భోజనానికిపిలిచినా పొయ్యేవాడుకాదు చుట్టాల్లో భోజనానికిపిలిస్తే, "అరే! ఏంభోజనంలేరా, నాన్నా! రాకపోతే ఏమనుకోకు నేను భోజనానికి రాకపోయినంతమాత్రాన మీకుచుట్టాన్నికాకపోలేదు. మీరు భోజనానికిపిలవకపోయినంతమాత్రాన నాకు చుట్టాలుకాకపోలేదు. ఏమనుకోవుకదూ? వస్తేవస్తాను. ఏమిటో! ఆ! ఏమిటోతగనిబద్ధకం కావాలనిరావడం లేదనిఅనుకోకు"అని చెప్పేవాడు. నరసింహారావు భావంవెలిపుచ్చటానికి తంటాలుపడేవాళ్ళలోఒకడు. ఇవతలవాడికి ధణులెగిరేటట్టు లెక్చరిస్తేగాని మరి బోధపడదు.

అవతలవాడు వీడిసంగతి తెలిసినవాడయినట్టయినా వాడిఅవస్తకు జాలిపడి "సరేలే" అని పోతాడు. నరసింహారావు స్నేహితుల్లో దాదాపందరూ అతని సంగతి తెలిసినవారే. ఒక్కొక్కప్పుడందరిమీదా కన్నుమనేవాడు. వాళ్ళప్పుడు తగ్గేవాళ్ళు. మర్నాడు మామూలే—ఏరా! అతనికితరులతో కలసిమెలసి తిరగటంచేతకాదు. ఒక్కడిపద్ధతిబాగుంటుందంటాడు. దానికితగినట్టు భగవంతుడుకూడా అట్లాగేచేశాడు.

నరసింహారావుకు పెళ్ళయినాలుగేళ్ళయింది. ఈ నాలుగేళ్ళలో అత్తగారింటికి వెళ్ళనేలేదు. ఏడాది లోపలకాములు పొరపాటున తీసికెళ్ళుతారుచూడండి!—అంతే! పండగాలేదు, పర్వంలేదు. ఆఒక్కసారి తీసికెళ్ళినప్పుడు మామగారూవాళ్ళూ తగని మర్యాదచేశారు వద్దన్నకొద్దీ బట్టలుపెట్టారు. ఇటువంటివి నరసింహారావుకు తగనిఅసహ్యం ఈమూణ్ణాళ్ళప్రేమలతనికిష్టంలేదు ఒకసారి అత్తవారికి అల్లుడిమీద కూతురిద్వారాప్రేమేకాని అసలుప్రేమ ఉండదని ఎవరితోనోఅన్నాడు అది కావలిసినవాళ్ళకి నలుగురికీ తెలిసింది ఆమాటఅన్నందుకు విచారమైనా లేదు నరసింహారావుకు

అత్తవారెన్నిసార్లుపిలిచినా ఎగ్గొట్టటమే! కావాలని రావటంలేదని అనుకుంటారనన్నా దిగులులేదు. నలుగురూఅనుకునేవాళ్ళు "ఆ! ఇప్పుడుకాదు పెళ్ళాం వచ్చింతరువాత ఈపోకపోవటాలుతెలుస్తయి ఆవిడగారు వస్తేగాని—" అదివిని నరసింహారావు "పోనీలే! అప్పుడుపోతాం ఏంపోతే? ఇప్పుడు కావాలని పోవటంలేదని ఎందుకనుకుంటావు? మనం మన

పెళ్ళాలకోసం పోతాంగాని ఇంకోరికోసంపోంగా!" అనేవాడు. "అదికాదు. అప్పుడెట్లాగూపొయ్యేవాడి విప్పుడెందుకుపోవు?" అనేవాళ్లు. "అదే తెలివి తక్కువ! అర్థంచేసుకోలేకపోతేసరి!" అని పెంకెగా జవాబిచ్చేవాడు ఎన్నిసార్లుపోకపోయినా మామ గారు పిలవడంమానలేదు వాళ్ళఓపిక—

౨

గున్నమామిడికిందకూర్చొని నరసింహారావు ఫ్రీ ప్రెస్ జర్నల్ చదువుతున్నాడు. పక్కనరామారావుకూర్చొని నరసింహారావువంక తదేకదృష్టితో చూస్తున్నాడు అంతకుముందే ఇద్దరికీ కొంచెంవాదన జరిగింది ఇద్దరూ పదినిమిషాలు కూర్చున్నారు.

"నిన్నుచూస్తేజాలేస్తున్నదిరా నాకు!" అన్నాడు రామారా వకస్మాత్తుగా

"ఏం?" అన్నాడు నరసింహారావు పేపరుచదువుతూనే.

"ఇట్లాఎంతకాలం ఉంటావు?"

"ఎట్లా?"

"బి ఏ ప్యాసయినావ్ ఇరవైయేళ్ళొచ్చినయ్. సత్రంభోజనం, మఠానిద్రా కాస్తతలనొప్పిఒస్తే చేసే వాళ్ళులేరు నీకు దిగులులేదుట్రా?"

నరసింహారావుకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోవటంచేత స్నేహితుల కతన్నిచూస్తేజాలి

"ఎందుకురా దిగులు?"

"నువ్వుభార్యనెందుకుతెచ్చుకోవు?"

నరసింహారావు మాట్లాడలేదు

"పెళ్ళాం పెద్దమనిషై ఏడాదయిందికదా, భార్యను తీసుకురావు అత్తవారింటికెళ్ళవు మొన్నజ్వరం తేలిగ్గాపోమట్టికాని లేకపోతే ఎంతకష్టమయ్యేది. నీకు హోటల్లోఉన్నట్టింకోచోటఉండదా?"

నరసింహారావు నిట్టూర్పువుచ్చాడు

"ఏమిటోరా భార్యనుతెచ్చుకోవాలంటే ఎన్ని చిక్కులున్నై! మామగారు కార్యంచేసుకోమంటాడు నా కది ఇష్టంలేదు ఆయనకిదిష్టంలేదు ఇట్లాఉంది పరిస్థితి నేనొక్కణ్ణి"—

నరసింహారావు తదేకదృష్టితో చూడటంప్రారంభించాడు.

అకస్మాత్తుగా బయటచప్పుడైంది—పనిమనిషి మాటలతో "దొడ్లోఉన్నారు పో!"

ఇద్దరూఆవైపు చూస్తూకూచున్నారు ఒకబైరాగి వచ్చాడు సలాంకొట్టి నిలబడ్డాడు

"ఎవరునీవు?" అన్నాడు నరసింహారావు.

"మాదిదక్షిణాదిఉంది నేను అరవవాడు! సాధువులుదాచెప్తాను చెయ్యిచూస్తును. బాగుండినా మీతోచిందిప్పించండిమీ" అన్నాడు

"ఏంతీసుకుంటావు?" అన్నాడు రామారావు నవ్వుతూ

"చెప్తినిదా, మీఇష్టం. మాకు కష్టంఉంది"

"సరే, చూడు" అన్నాడు నరసింహారావు. బైరాగి "చూడ్డం" ప్రారంభించాడు ఏవేవోకూస్తున్నాడు రామారావు కొంచెమన్నా నిజంఉండకపోతుందాఅని ఊరుకున్నాడు. నరసింహారావు తల తిప్పుతున్నాడు.

"నీవుమంచి అదృష్టవంతుడు!" అన్నాడు బైరాగి.

"ఏం?" అన్నాడు నరసింహారావు.

"చిన్నరోజుల్లో గండంతగుల్తుంది! అయితే తప్పిపోవును"

"మావాడిపెళ్ళాం ఎప్పుడు కాపరానికివస్తుందో చెప్పు," అన్నాడు రామారావు

నరసింహారావు బలహీనంగానవ్వాడు.

"ఓ! అదిదా! కొద్దిరోజుల్లోనే రావలిసిఉంది!" అని ఇంకా ఏవేవో చెప్పిలేచిపోయినాడు బైరాగి.

"టైమెంతయిందిరా?" అన్నాడు నరసింహారావు.

"పదింబావు పెళ్ళాంవస్తుందికామాసు!"

"చాల్లేవోయమ్మ మరి. పద. హోటలుకెళ్ళాలి. ఈజ్యోతిష్కులు చెప్పేమాటలు నిజమైతే ఇండిపెండెన్స్ ఇదివరకేవచ్చేది!"

"మళ్ళీసాయంత్రంవస్తా" నంటూ రామారావు వెళ్ళాడు. నరసింహారావు బయటికి రాగానే వాకిట్లోకి బండివచ్చిఆగింది షురుక్షణం ప్రసాదరావు దిగాడు,

"ఎప్పుడొచ్చారు?" అన్నాడు నరసింహారావు

"ఇప్పుడే!" అన్నాడు ప్రసాదరావు బండివాడికి డబ్బులిస్తూ.

"ఏమిటి సంగతు లంతా కులాసా?"

"ఆ! నీవంట్లో బాగుందా?"

"ఆ!"

"ఎక్కడికి బయలుదేరావు?"

"హోటలుకు."

"అప్పుడే?"

"అప్పుడే ఏముంది పదయిందా"అన్నాడు? తాళం తీస్తూ నరసింహారావు ఇద్దరూమంచంమీద కూర్చున్నారు.

"మళ్ళీసాయంత్రం వెళ్ళుతాను. నువ్వునాలుగు రోజులక్కడికి రారాదూ?"

"ఆ! ఏమిటివచ్చేది? దేనికి?"

"ఏమికేమిటి? ఇక్కడహోటలేగా! రా! మీ అత్త చూడాలనుకుంటున్నది. రొండేళ్ళయింకెట చూసి, ఇప్పుడుశలవులేగా? నాలుగురోజులుండి పోదువుకాని, నేనిందుకేవచ్చాను ఇదివరకల్లేకాక ఈత ఖాకిరా ఏం?" అని ప్రసాదరావన్నాడు

"చూడాలనుకుంటే చూడలేకపోతారా? ఏమిటి పెద్దచూసేది?

"కాదులే! నామాటవిను"అని మరిమరిఅడిగాడు.

నరసింహారావు ఈతడవను ఎదురుచెప్పలేక, "సరే లెండి! సాయంత్రమా?" అన్నాడు

"ఆ! నాలుగ్గంటలబండికి"

3

"ఎప్పుడురావటం?"

"ఇప్పుడే."

"అంతాకులాసా?"

"ఆ! .అంతాఎవరున్నారు?"

"కాళ్ళుకడుక్కోండి", అని ఇంకా ఏవేవో మాట్లాడి అత్తగారు లోపలికెళ్ళింది నరసింహారావు కాళ్ళుకడుక్కున్నాడు. నరసింహారావత్తగారింటికి పెళ్ళయిన తరువాత ఇదేరావడం. అందువల్ల అక్కడక్కడ కలిగినమార్పులు ముందతన్నెదుర్కొన్నాయి. పంపాకటి పెట్టించారు కొత్తగా డాబాకాస్తా మేడయింది. నరసింహారావు దబదబా మేడమీదికి వెళ్ళాడు విపరీతంగా ఎరిగున్నట్టు సూర్యాస్తమయమై పావుగంటయింది నరసింహారావుపెట్టె ఒకగదిలో పెట్టాడు. ఆగదిలో సామానించుమించుగా ఏమీ లేదు. డాబామీదికెళ్ళాడు. చుట్టూచెట్లు కనపడుతున్నాయి. కంటికి బహుఅందంగాఉంది ఏటిగాలి కతనిప్రాణం లేచిపోతున్నది. అరాత్తుగా కమల జ్ఞాపకంవచ్చింది కమల! కమలఏది? ఎక్కడా కనపడలేదు. నాలుగేళ్ళయింది చూచి! ఈనాలుగేళ్ళమధ్య చూడటానికవకాశంకలిగినా అతనే పోగొట్టుకున్నాడు ఇప్పుడు బాగా ఎదిగుంటుంది. కమలను నరసింహారావు కోరికోరిచేసుకున్నాడు అతనికి కొన్నివందల సంబంధాలువచ్చినయి. ప్రతిపిల్లను చూడ్డం పెదవివిరచటం కమలకన్న అందమైనపిల్లలను చూచినాడు కాని అతనికి కావలిసిన చురుకుదనం వాళ్ళెవరిదగ్గిరా కనపళ్ళేదు. ఎన్నిసంబంధాలుచూసినా కుదరలేదు ప్రాణంవిసిగిపోయింది. "ఇదేంవిడ్డూరమమ్మా? కావలిసినవన్నీ ఎక్కడదొరుకుతవి?" అనేవాళ్ళు నలుగురూ విసిగి నరసింహారావు కన్యాన్వేషణ మానేశాడు నాకు కావలసినపిల్ల ఈలోకంలోలేదు కాబోలునని దిగులుపడ్డాడు చివరకి కమల లభించింది పెళ్ళిలోసంగతి జ్ఞాపకంవచ్చింది మేజువాణిలో కమలకు నిలువునాబొట్టుపెట్టాడు కమల నరసింహారావుకు చుక్కపెట్టింది—నరసింహారావుకు నవ్వు వచ్చింది

కాని అకస్మాత్తుగా ఒకభయంకరమైన ఆలోచన వచ్చింది కమలకుతన్నుచూస్తే ఇష్టంలేదేమో? తాను ఎప్పుడూ రాకపోవటంచేత తనమీద ఇష్టంలేదని కమలకుమనస్సు విరిగిపోయిందేమో? నరసింహారావుకుమనస్సుమనస్సులోలేదు. మనస్సెట్లాగోమళ్ళించుకుని కూనిరాగాలుతియ్యటం మొదలుపెట్టాడు. కొంచెంచీకటిపడ్డది నరసింహారావు లేచినిలుచుని ఎర్రని చంద్రుణ్ణి చూస్తున్నాడు. కమ్మని పూలవాసనవస్తు

న్నది. చంద్రుడు కొంచెం కొంచెంగా తెల్లబడుతున్నాడు చీకటికీ చంద్రుడికీ యుద్ధం ప్రారంభమయింది చీకటి ముందంజవేసింది అప్పుడు చంద్రుడు, "ఇవ్వాళకాదులే! రేపటినించీ నువ్వేముందరపద్దూగాని" అంటున్నాడు చీకటికాదన్నట్టుగా తలఊపడం ప్రారంభించింది చంద్రుడు కొంచెం కసరాడు. చివరకు చీకటి పుంజాలు తెంపుకు పరిగెత్తుకు పోయింది

ఇట్లా ఒకపావుగంట గడిచింది. మామగారు పైకి వచ్చి స్నానంచెయ్యమన్నాడు. నరసింహారావు భోంచేసి గదిదగ్గిరికిరాగానే కమల ఆగదిలోనించి పరిగెత్తుకునిపోయింది నరసింహారావు గదిలోకిపోయి బట్టలుకట్టుకుంటూండగా బల్లమీద తములపాకుల చిలకలు కనపడ్డయి పక్కన వక్కపొడికూడాఉంది. నరసింహారావమాంతంగా వాటిని నోట్లో కుక్కుకున్నాడు

౪

తెల్లవారింది నరసింహారావు కాలకృత్యాలు తీర్చుకుని స్నానంచేసి పుస్తకంచదువుకుంటూ కూర్చున్నాడు. అయిదు నిమిషాలు చదివాడు ఏమీసాగలేదు. పుస్తకంమడిచి బయటికివచ్చాడు. కమలకనపడ్డది. ఇతన్నిచూసి ఆగింది ఇతను కేవలం ఆమె వెళ్ళే దోవలోనే ఉండడంచేత ఆగవలిసివచ్చింది. తలవంచుకుని నిలబడ్డది కమల కొంచెంమారింది. పెద్దదయింది కూడానుమరి నరసింహారావు మాట్లాడకుండా ఒకనిమిషం నిలుచున్నాడు కమలనుచూస్తూ కింద అత్తగారు కమలను ఊరికేపిలుస్తున్నది కమల కొంచెం తలఎత్తి చిరునవ్వుతో నరసింహారావు వంక చూచింది "మీరే ఇట్లాచేస్తే ఎట్లాగండీ" అన్నట్టు. నరసింహారావు గదిలోకి వెళ్ళినాడు ఎడమకన్నదరడం ప్రారంభించింది అతనికి పిచ్చినమ్మకాలులేవు కుడికన్నదరితే అదృష్టమున్నూ, ఎడమకన్నదరితే పైత్యమునూఅని అతనిఉద్దేశం.

ఏడుగంటలయింది. వెండిగిన్నెలోకాఫీ, పళ్ళెంలో ఉప్మాపట్టుకుని మామగారు ప్రవేశించాడు.

నరసింహారావుదృష్టి కాఫీమీదలేదు. కిటికీలోనించి బయటికిచూస్తున్నాడు. మామగారు కాఫీ ఉప్మాలు అక్కడఉంచి వెళ్లిపోయినాడు. కాఫీ చల్లారి పోతున్నది. అతను కాఫీవంకకు తిరిగాడు. కమల తలవంచుకుని నిలబడిఉన్నది. నరసింహారావు కమలవైపుతిరగ్గానే ఆమెబొటనవ్రేలితో నేలను రాయటం మొదలుపెట్టింది.

"ఏమిటి?" అన్నాడు నరసింహారావు

కమలమెల్లిగా తలఎత్తింది కళ్ళల్లో ఇందాకటి కాంతిలేదు. మెల్లిగాతలవంచింది నరసింహారావు ఆశ్చర్యపడ్డాడు. లేచి కమలదగ్గిరికివెళ్ళి వణుకుతూ ఉన్న ఆమెచేతినిపట్టుకుని ఆమె ముఖాన్ని తనవైపుకు తిప్పుకున్నాడు

"ఏమిటి?"

కమల మళ్ళీ తలవంచింది.

"చెప్పవ్?"

"కాఫీతాగారా?" అంది తలఎత్తకుండానే.

"తాగలేదు. దేనికి?"

"తాగవద్దు!"

"ఏం?"

కమల మాట్లాడలేదు.

"ఎందుచేత?"

"అది బాగుండదు!"

"ఎందుకని?"

"అందులో సీకాయపొడి కలిపింది మాఅమ్మ!" నరసింహారావు కర్థంకాలేదు. కాస్సేపుండినవ్వాడు

"సీకాయపొడి కలిపితే రుచిఎక్కువవుతుంది."

"అదిసీ—సీకాయపొడికాదు. మరేమిటో! ఏదో పొడి కలిపింది"

"ఏంపొడి?"

"ఏదోనాకు తెలియదు"

"అయితే తాగితేఏం?"

"వద్దు! కాఫీబాగుండదు!"

నరసింహారావుకు ఒకభయంకరమైన ఆలోచన తట్టింది. పెదిమకొరుకుతూ రెండునిమిషాలాలోచించాడు.

"ఆకలిపిందేమైఉంటుంది?" అన్నాడు కమల వీపుతట్టుతూ.

"నాకు తెలియదు."

"ఏమన్నా—అనుమానమా—మందా—?" కమల మెల్లిగా తలఎత్తిచూచింది. ఆచూపులో ఏమీలేదు నరసింహారావు కమలను మెల్లిగా కౌగిలించుకున్నాడు. కాస్సేపుండి నవ్వుతూ—"నీకెట్లా తెలుసు?"

"నేనుచూచా!"

"ఎప్పుడు?"

ఇందాకా నేను కనపడకపోతే ఎక్కడున్నానో అని నాలుగుసార్లు పిలిచింది. నేను పలకలేదు.—"

"అప్పుడెక్కడున్నావు?"

కమల నవ్వింది

నరసింహారావు కమల చెక్కిళ్ళునొక్కుతూ "తరవాత" అన్నాడు.

"నేను లేననుకుని ధైర్యంతో కలపటం ప్రారంభించింది.—"

"ఏమిటి?"

"పొడి!"

నరసింహారావు కమలను గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

"నేను కిందికెళ్ళేటప్పటికి కలుపుతున్నది."

"అది సీకాయపొడికాదని నీకెట్లా తెలుసు?"

"సీకాయపొడి ముందరే డికాక్షనులో కలుపుతారు తయారైనకాఫీలో కలపరు!"

"అట్లాగా? నాకు తెలీదులే!"

కమల మెల్లిగానవ్వటం మొదలుపెట్టింది నరసింహారావువంకచూస్తూ. నరసింహారావూ నవ్వటం మొదలుపెట్టాడు కాని ఆనవ్వు ఒక్కక్షణంమాత్రమే. మరుక్షణం అతనిముఖం గంభీరంగాఉంది అయిదునిమిషాలు ఆలోచించాడు.

"నేను ఊరికెళుతున్నా!"

"ఎప్పుడు?"

"ఈబండికే."

"దేనికి?"

"నీకు తెలియదూ?"

"రెండురోజులుండండి." కమల కళ్ళల్లో ఇష్టం లేదు.

"ఎందుకు? చావటానికా?"

కమల తలవంచింది. కళ్ళవెంబడి నీళ్ళువచ్చినై. నరసింహారావు కమల తలఎత్తి నీళ్ళుతుడిచాడు.

"నీఅదృష్టం. మంచిమొగుణ్ణి సంపాదించుకున్నావు. నాతోరావూ?"

"మాఅమ్మావాళ్ళు కోప్పడరూ?"

"సరే నీయిష్టం"

"రెండురోజులుండండి!" కమలనవ్వింది.

"సరేలే, లే! పెట్టెసర్దుకో, బండితెస్తా."

"మానాన్నకిదేమీ తెలియదు. ఆయన తగనిమంచివాడు. మాఅమ్మ—మానాన్న నడగరూ?"

"అడుగుతాను ఒప్పుకుంటేవస్తావు ఒప్పుకోకపోతే?"

"వస్తాను."

"చేతులోచెయ్యివెయ్యి"

కమలనవ్వుతూ వేసింది

"గిల్లాలి."

◆ ◆ ◆

నరసింహారావు బండితెచ్చేసరికి ఎక్కడికోవెళ్ళిన మామగారువచ్చాడు కమలపెట్టెసర్దుకుంది నరసింహారావు కాఫీ సంగతిచెప్పక కమలను తీసికెళ్లుతానని పట్టుదలపట్టాడు మామగారు గాభరాతిన్నాడు. ఆయనకేమీ అర్థంకాలేదు అల్లుడిలోనిమార్పు. బతిమాలాడు. నలుగురూవింటే బాగుండదన్నాడు. నరసింహారావు వినలేదు అత్తగారేదో చెప్పవచ్చింది. నరసింహారావు ఆమెవేపు తీక్షణంగాచూచాడు. అంతే. ఆవిడమాట్లాడలేదు.

కమల తండ్రివంక దీనంగాచూస్తూ బండిఎక్కింది. కళ్ళవెంబడి నీళ్ళొచ్చినై. బలవంతాన ఆపుకుంది, బండి గబగబా స్టేషనుకువెళ్లింది.

ప్రసాదరావుకు వళ్ళంతా కారంరాచినట్టుంది. నిశ్చేష్టుడైపోయినాడు. వళ్ళంతాచెమట పట్టింది. గబగబా మేడమీదికెళ్ళాడు. ఏమీతోచలేదు. నరసింహారావు గదిలోకివెళ్లాడు. ఉప్మాకాస్తా అమాంతంగాతిని కాఫీతాగటం మొదలుపెట్టాడు.